# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 12-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- పారిశ్రామిక సంబంధాల కోడ్ (సవరణ) బిల్లు-2026కు లోక్‌సభ ఈరోజు ఆమోదం తెలిపింది.
- దేశంలో నేడు ద్రవ్యోల్బణ సంక్షోభం లేదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.
- న్యూఢిల్లీ వేదికగా జరగనున్న ఇండియా-AI ఇంపాక్ట్ సమ్మిట్ కు బ్రెజిల్, ఫ్రాన్స్ అధ్యక్షులు హాజరవుతారని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22న ప్రసారమవుతుంది.
- టీ-20 ప్రపంచ కప్‌లో భాగంగా భారత్, నమీబియా జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

========================

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఈరోజు పారిశ్రామిక సంబంధాల కోడ్ (సవరణ) బిల్లు 2026కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 2020 నాటి పారిశ్రామిక సంబంధాల కోడ్‌లో కొన్ని కీలక మార్పులు చేసేందుకు ఈ బిల్లును తీసుకువచ్చారు. కార్మిక సంస్కరణలను మరింత బలోపేతం చేయడం, పరిశ్రమలు - కార్మికుల మధ్య సంబంధాలను మెరుగుపరచడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. అంతకు ముందు ఈ బిల్లుపై జరిగిన చర్చలో కేంద్ర కార్మిక శాఖా మంత్రి మాన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ...ఈ నూతన బిల్లు చట్టబద్ధమైన మద్దతుతో కనీస వేతనాన్ని నిర్ధారిస్తుందని చెప్పారు. నిర్దేశించిన కనీస వేతనం కంటే తక్కువ వేతనాలను నిర్ణయించడానికి రాష్ట్రాలకు అధికారం ఉండదని ఆయన స్పష్టం చేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

========================

కేంద్ర బడ్జెట్ 2026-27పై చర్చలో భాగంగా రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రోజు మాట్లాడారు. కేంద్రం నిధులు ఇష్టానుసారంగా ఉపయోగించుకునే ఉచిత నగదు సమూహం కాదని, దేశంలోని ప్రతి

పౌరుని కష్టార్జితమన్నారు. కేవలం నిర్ణీత ఈగడువులను తీర్చడానికి వీటిని కేంద్ర ప్రభుత్వం వృధా చేయకూడదని చెప్పారు. గత 10 ఏళ్లలో చేపట్టిన ఆర్థిక సంస్కరణలతో మధ్య తరగతి జీవన ప్రమాణాలు మరింత మెరుగయ్యాయన్నారు. అలాగే దేశంలో నేడు ద్రవ్యోల్బణ సంక్షోభం లేదని అన్నారు.

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలోని సేవా తీర్థ భవన సముదాయాన్ని, కర్తవ్య భవన్-1, 2 లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు లాంఛనంగా ప్రారంభిస్తారు. సేవా తీర్థ భవన సముదాయం నూతన పేరును ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరిస్తారు. ఈ సేవా తీర్థ భవనంలో ప్రధానమంత్రి కార్యాలయం, జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్, క్యాబినెట్ సెక్రటేరియట్ లు ఉన్నాయి. కర్తవ్య భవన్-1, 2 లలో ఆర్థిక, రక్షణ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, విద్య, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖలతో సహా పలు కీలక మంత్రిత్వ శాఖలు ఉన్నాయి. ఈ రెండు భవన సముదాయాలు డిజిటల్ ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలు, పబ్లిక్ ఇంటర్‌ఫేస్ జోన్‌లు, కేంద్రీకృత రిసెప్షన్ సౌకర్యాలను కలిగి ఉన్నాయి. అలాగే వీటిలో స్మార్ట్ యాక్సెస్ కంట్రోల్ సిస్టమ్స్, నిఘా నెట్‌వర్క్, అధునాతన అత్యవసర ప్రతిస్పందన మౌలిక సదుపాయాలు వంటి సమగ్ర భద్రతా వలయాలు కూడా ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా ఈ నెల 18 నుండి 22 వరకు న్యూఢిల్లీలో జరగనున్న ఇండియా-AI ఇంపాక్ట్ సమ్మిట్ కు హాజరవుతారని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. బ్రెజిల్ అధ్యక్షుడితో పాటు పలువురు మంత్రులు, వ్యాపార వేత్తలు భారత్ కు వస్తున్నారని న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన వెల్లడించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బ్రెజిల్ అధ్యక్షుడికి ఆతిధ్యం ఇస్తారని, ఈ నెల 21వ తేదీన ఆయనతో ద్వైపాక్షిక చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కూడా మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. అమెరికాతో తాత్కాలిక వాణిజ్య ఒప్పందంపై రణధీర్ జైస్వాల్ వివరణ ఇస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్‌లో లక్షా 60 వేల మందికి పైగా కొత్త చందాదారులు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (EPFO)లో చేరారని  కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే అన్నారు. జమ్మూ కాశ్మీర్ నిరుద్యోగ సమస్యపై రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి సమాధానమిస్తూ.. దేశంలో MSME రంగాన్ని వ్యవస్థీకరించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఉద్యమం పోర్టల్‌లో 8.2 లక్షల యూనిట్లు నమోదు చేయబడ్డాయని, దీని ద్వారా దాదాపు 32 లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో మాత్రమే 3.5 లక్షలకు పైగా ప్రజలు క్రెడిట్ గ్యారెంటీ పథకం కింద 4,390 కోట్ల రూపాయల విలువైన రుణాలు పొందారని మంత్రి కరంద్లాజే తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ విద్యా వ్యవస్థలో కృత్రిమ మేధ (AI)ను సమ్మిళితం చేస్తామని విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. న్యూఢిల్లీలోని భారత మండపం వేదికగా జరుగుతున్న ``భారత్ బోధన్ AI సదస్సు - 2026``ను ఉద్దేశించి ఆయన ఈరోజు మాట్లాడారు. పాఠశాలల్లో 3వ తరగతి నుండి అధునాతన పరిశోధన స్థాయిల వరకు విద్యారంగంలో AIని చేర్చుతామమని, ఇది అధ్యయన అంశంగా మాత్రమే కాకుండా... పరిశోధన అంశంగాను, ఆవిష్కరణ నమూనాగాను

ఉంటుందని చెప్పారు. రాబోయే ఐదు సంవత్సరాలలో కృత్రిమ మేధ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 15 ట్రిలియన్ డాలర్ల విభాగంగా అభివృద్ధి చెందుతుందని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

========================

ఎనిమిది డార్నియర్ 228 రకం విమానాలు కొనుగోలు చేయడానికి కాన్పూర్ లోని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ (హెచ్ఏఎల్) ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ డివిజన్‌తో రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అదే విధంగా భారతీయ కోస్తాతీర రక్షక దళం (ఐసీజీ) కోసం ఆపరేషనల్ రోల్ ఎక్విప్‌మెంట్‌ను కూడా 2,312 కోట్ల రూపాయల వ్యయంతో సమకూర్చనుంది. రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో న్యూఢిల్లీలో ఈ ఒప్పంద పత్రంపై ఈ రోజు సంతకాలు జరిగాయి.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 20వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

========================

టీ-20 ప్రపంచ కప్‌లో భాగంగా భారత్ నమీబియా జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ స్టేడియం వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన నమీబియా బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 18 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 199 పరుగులు చేసింది. అంతకుముందు శ్రీలంకలోని పల్లకెలె స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఒమన్ జట్టుపై శ్రీలంక 105 పరుగుల తేడాతో విజయం సాధించింది. అదే విధంగా ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా నేపాల్ తో జరిగిన మ్యాచ్‌లో ఇటలీ 10 వికెట్ల తేడాతో  గెలిచింది.

========================
========================